సాక్షి
మహబూబ్‌నగర్
ఆదివారం । 25 । మే । 2025



మార్మోగిన బీచుపల్లి

బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది.

వివరాలు 8లో ▸



రైతులు సహకరించాలి

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ కోరారు.

వివరాలు 8లో ▸

గరిష్టం/కనిష్టం
35.7 /23.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఈదురుగాలులు, ఉరుములతో కూడిన వర్షం పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పకడ్బందీగా నిర్వహించాలి



జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): గ్రామపాలన అధికారి పరీక్షను పకడ్బందీగా నిర్వహించాలని భూ పరిపాలన శాఖ ప్రధాన కమిషనర్ నవీన్ మిట్టల్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి వీసీలో మాట్లాడారు. ఆదివారం ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగే పరీక్షకు అన్ని ఏర్పాట్లు చేయాలన్నారు. పరీక్ష ప్రారంభానికి గంట ముందు అభ్యర్థులను హాల్‌లోకి అనుమతించారు. ఒక్క నిమిషం అలస్యమైన అనుమతి లేదని, పరీక్ష ముగిసే వరకు బయటికి వెళ్లేందుకు వీల్లేదని తెలిపారు. పరీక్ష కేంద్రాల చుట్టూ పక్కల జిరాక్స్ దుకాణాలు మూసివేయాలని, 144 సెక్షన్ అమలు చేయాలని ఆదేశించారు. పరీక్షలు ముగిసిన తర్వాత జవాబు పత్రాలను సీల్ చేసి జేఎన్‌టీయూహెచ్‌కు అందించాలని, ఉపయోగించని జవాబు పత్రాలను కూడా తప్పనిసరిగా పరీక్ష కేంద్రాల నుంచి సేకరించాలన్నారు. అనంతరం కలెక్టర్ విజయేందిర మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో చైతన్య హైస్కూల్‌లో పరీక్షకేంద్రం ఏర్పాటు చేశామని, 152 మంది అభ్యర్థులు రాయనున్నట్లు వెల్లడించారు. వీసీలో రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్‌రావు, ఆర్డీఓ నవీన్, చీఫ్ సూపరింటెండెంట్ మహమ్మద్ అహ్మద్, కలెక్టరేట్ ఏఓ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు



దేవరకద్ర: నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరంగా కఠినచర్యలు తీసుకుంటామని ఎస్పీ జానకి హెచ్చరించారు. శనివారం దేవరకద్ర పోలీసుస్టేషన్‌ను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో కొందరు వ్యాపారులు గ్రామాల్లో తిరిగి నకిలీ బీజీ పత్తి విత్తనాలు విక్రయిస్తారని, అలాంటి వారి పట్ల రైతులు జాగ్రత్తగా ఉండాలని కోరారు. గ్రామాలకు వచ్చే నకిలీ విక్రయదారుల సమాచారం పోలీసులకు ఇస్తే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులను మోసం చేసే ఏ వ్యాపారి అయినా జైలుకు వెళ్లక తప్పదని హెచ్చరించారు. దేవరకద్రలో ప్రతి బుధవారం సంతలో కొందరు దొంగతనాలకు పాల్పడుతున్నారని తెలిపారు. వీటిని అరికట్టడానికి మఫ్టీలో పోలీసులను పెడతామని తెలిపారు. కొత్త మండలాలు కౌకుంట్ల, గండేడ్‌లలో త్వరలో కొత్త పోలీసుస్టేషన్‌లను ఏర్పాటు చేస్తామని పేర్కొన్నారు. స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించి నేరాలకు సంబంధించి నమోదు అవుతున్న కేసులపై ఆరా తీశారు. అనంతరం దేవరకద్ర రైల్వే స్టేషన్ పరిసరాలను ఎస్పీ పరిశీలించారు. ఆమె వెంట ఎస్‌ఐ నాగన్న ఉన్నారు.

30న ఇంటర్వ్యూలు

పాలమూరు: జిల్లా ఆరోగ్యశాఖ పరిధిలోని ప్రధానమంత్రి జన్‌జాతి ఆదివాసి న్యాయ మహా అభియాన్ పథకం కింద కాంట్రాక్ట్ పద్ధతిలో ఖాళీలు భర్తీ చేస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ డాక్టర్ కృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకటి మెడికల్ ఆఫీసర్, ఒక ల్యాబ్ టెక్నీషియన్, ఒకటి పారా మెడికల్ అసిస్టెంట్ పోస్టులను ఒక ఏడాది పాటు కాంట్రాక్ట్ పద్ధతిన తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. ఈనెల 30న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్నామని, అర్హులైన బలహీన గిరిజన అభ్యర్థులు హాజరుకావాలని సూచించారు.

పాలిసెట్‌లో 42 శాతం ఉత్తీర్ణత

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పాలిసెట్ ఫలితాల్లో మహబూబ్‌నగర్ జిల్లా విద్యార్థులు 42శాతం ఉత్తీర్ణత సాధించారు. జిల్లావ్యాప్తంగా ఆరు కేంద్రాల్లో మే 13 పరీక్ష నిర్వహించగా 3,187 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లాకేంద్రానికి చెందిన ఉందాల్య కౌశిక్ నారాయణ రాష్ట్ర స్థాయిలో మొదటి ర్యాంక్ సాధించాడు. అలాగే ఆవిషెట్టి ధనుష్‌తేజ 34వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా ర్యాంకులు సాధించిన విద్యార్థులకు కుటుంబసభ్యులు, మిత్రులు అభినందించారు.

చిన్నారుల పొదరిల్లు



మహబూబ్‌నగర్ బాలభవన్‌లో చిన్నారులకు నృత్యంలో శిక్షణ



చిన్నారులు వేసవి సెలవులను సరదాగా గడుపుతూనే.. మరోవైపు తమ సృజనాత్మకతను పదునుపెడుతున్నారు. జానపదం, సంగీతం, వాయిద్యం, నాట్యం, చిత్రలేఖనం, కుట్టు–అల్లికలు..ఇలా పలు అంశాల్లో విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత, కళాత్మక విషయాలను బయటకు తీసేందుకు బాలకేంద్రం, బాలభవన్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఏడాది మొత్తం పుస్తకాలతో కుస్తీ పట్టే చిన్నారులకు కొత్త అంశాలను నేర్చుకునేందుకు అవకాశం లభించింది. ఉమ్మడి జిల్లాలో మహబూబ్‌నగర్, నారాయణపేట బాలకేంద్రాల్లో, గద్వాల, వనపర్తి బాలభవన్‌లో దాదాపు 1,500 మంది చిన్నారులు శిక్షణ తీసుకుంటున్నారు.

– స్టేషన్ మహబూబ్‌నగర్/గద్వాల టౌన్/ నారాయణపేట రూరల్/ వనపర్తి ఎడ్యుకేషన్

నాలుగు సాంస్కృతిక అంశాల్లో శిక్షణ

మహబూబ్‌నగర్ బాలకేంద్రంలో వేసవి సెలవులను పురస్కరించుకొని చిన్నారులకు వివిధ అంశాల్లో సాంస్కృతిక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. గత నెల 28న ప్రారంభమైన ఈ శిక్షణ వచ్చే నెల 5 వరకు కొనసాగనుంది. శాస్త్రీయ నృత్య, గాత్ర సంగీతం, చిత్రలేఖనం, టైలరింగ్ అంశాల్లో శిక్షణ ఇస్తున్నారు. శాస్త్రీయ నృత్యంలో భాగంగా కూచిపూడికి దివ్య, భరత నాట్యంకు హైందవి శిక్షణ ఇస్తున్నారు. గాత్ర సంగీతం సరోజ, చిత్రలేఖనం రాజేష్ ఖన్నా, టైలరింగ్‌లో వెంకటేశ్వరమ్మ శిక్షణ అందిస్తున్నారు. ఉదయం 8.30 నుంచి 12.30 గంటల వరకు శిక్షణ కొనసాగుతుంది. నాలుగు సాంస్కృతిక అంశాల్లో దాదాపు 300 మంది విద్యార్థులు శిక్షణ పొందుతున్నారు.

- వేసవి శిక్షణకు వేదికగా బాలభవన్, బాలకేంద్రాలు
- నృత్యం, సంగీతం, చిత్రలేఖనం నేర్చుకునేందుకు చిన్నారుల ఆసక్తి
- ఉమ్మడి జిల్లాలో 4 కేంద్రాల్లో 16 ఏళ్ల లోపు బాలబాలికలకు ప్రత్యేక శిక్షణ



గద్వాల బాలభవన్‌లో నృత్యంలో శిక్షణ పొందుతున్న చిన్నారులు



కళల ప్రపంచం.. ‘పేట’ బాలకేంద్రం

నారాయణపేటలో 1983లో 9 మంది చిన్నారులతో ఏర్పాటైన బాలకేంద్రం చౌక్‌బజార్‌లోని అద్దె భవనంలో కొనసాగింది. ఆ తర్వాత మినీస్టేడియం గ్రౌండ్‌లో వృథాగా ఉన్న ఓ భవనంలోకి మార్చారు. ఇక్కడ తబలా, సితార్, గాత్రం, నృత్యం, చిత్రలేఖనంపై శిక్షణ ఇస్తున్నారు. 6 నుంచి 15 ఏళ్లలోపు చిన్నారులకు ప్రతిరోజు సాయంత్రం 5 నుంచి 7 గంటల వరకు బాలకేంద్రంలో శిక్షణ ఇస్తున్నారు. జనరల్ విద్యార్థులకు రూ.50, ఎస్సీ, ఎస్టీ, బీసీ చిన్నారులకు రూ.20 ప్రవేశ రుసుము వసూలు చేస్తారు. ఏటా వేసవిలో వందమంది పిల్లలు శిక్షణ పొందడానికి వస్తుంటారు. వీరికి దాతల సహకారంతో నోట్ పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, ప్యాడ్ వంటి పరికరాలు ఉచితంగా అందిస్తున్నారు. ఇక తరచుగా దాతలతో స్నాక్స్ సైతం అందించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఇక్కడ శిక్షణ పొందిన ఎంతో మంది చిన్నారులు రాష్ట్ర, జాతీయ స్థాయి వరకు పాల్గొని మంచి పేరు తీసుకువచ్చారు.



నారాయణపేట బాలకేంద్రంలో వివిధ సంగీత వాయిద్యాలపై శిక్షణ పొందుతున్న విద్యార్థులు

సమ్మర్ స్పెషల్

ఉత్సాహభరితంగా..

గద్వాల బాలభవన్‌లో400కు పైగా విద్యార్థులు వివిధ కళల్లో శిక్షణ పొందారు. 5–16 ఏళ్లలోపు చిన్నారులకు ఉత్సాహభరిత వాతావరణంలో వేసవి శిబిరం కొనసాగుతుంది. వివిధ కళల్లో నైపుణ్యం ఉన్న శిక్షకులు చిన్నారులకు శిక్షణ ఇస్తూ బాల కళాకారులుగా తీర్చిదిద్దారు. చిన్నారులకు భరతనాట్యం, జానపద నృత్యం, శాస్త్రీయ నృత్యాలను శిక్షకులు సత్యం, చిత్రలేఖనం గణేష్, సంగీతం శివ కుమార్, వాయిద్యాలు శంకర్, ఎంబ్రాయిడరీ, టైలరింగ్‌లో గాయిత్రి తదితరులు విద్యార్థులకు శిక్షణ ఇస్తున్నారు.

శిక్షణ ముగిసిన తర్వాత పరీక్షలు

వనపర్తిలోని బాలభవన్‌లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో బాల బాలికలకు ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఉదయం 9 నుంచి 10 గంటల వరకు నృత్యం, చిత్రలేఖనం నేర్పిస్తున్నారు. 10.30 నుంచి 12.30 గంటల వరకు 6వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు నృత్యం, చిత్రలేఖనం, టైలరింగ్‌లో శిక్షణ ఇస్తున్నారు. ఇక్కడ ఏప్రిల్ 20 నుంచి 400 మందికి శిక్షణ ఇస్తున్నామ సూపరింటెండెంట్ లావణ్య పేర్కొన్నారు. సమ్మర్ క్యాంప్ అయిపోయిన తర్వాత కొంతమంది విద్యార్థులు నృత్యం, చిత్రలేఖనం, టైలరింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నారని, శిక్షణ ముగిసిన తర్వాత విద్యార్థులకు ప్రతి బ్యాచ్‌కు లోయర్, హయ్యర్ పరీక్షలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.



వనపర్తి బాలభవన్‌లో చిత్రలేఖనంలో శిక్షణ

మొదటిసారిగా వచ్చా..



చిత్రాలు గీయడం అంటే ఎంతో ఇష్టం. స్కూల్‌లో చిత్రాలు గీయడం ప్రాక్టీస్ చేసేవాడిని. కొన్ని సార్లు పాఠశాలలో జరిగిన చిత్రలేఖన కాంపిటేషన్‌లో పాల్గొన్నా. మొదటిసారిగా బాలకేంద్రంలో చిత్రలేఖనంలో శిక్షణ తీసుకుంటున్నా.

– హర్షవర్ధన్, మహబూబ్‌నగర్

మూడేళ్ల నుంచి..



మూడేళ్ల నుంచి వేసవిలో బాలకేంద్రంలో కూచిపూడిలో శిక్షణ తీసుకుంటున్నా. వేసవి అనంతరం మిగతా రోజుల్లో ఆదివారం శిక్షణ తీసుకుంటున్నా. చాలా చక్కగా నేర్పిస్తున్నారు. కూచిపూడి నృత్యంలో ఉన్నతస్థాయికి చేరడమే నా లక్ష్యం.

– లహరి, మహబూబ్‌నగర్

విశేషమైన స్పందన..



బాలకేంద్రంలో వేసవి శిక్షణ తరగతులకు విశేషమైన స్పందన లభిస్తుంది. శిక్షణ అనంతరం ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తాం. బాల కేంద్రాన్ని బాల భవన్‌గా మారిస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. శాశ్వత పద్ధతిన శిక్షకులు నియమితులవుతారు. సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు మెరుగైన శిక్షణ అందించి రాష్ట్ర, జాతీయస్థాయి పోటీలకు పంపించే అవకాశం ఉంటుంది. శిక్షణ అనంతరం ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహిస్తాం.

– రాజేష్ ఖన్నా, ఇన్‌చార్జి సూపరింటెండెంట్, బాలకేంద్రం, మహబూబ్‌నగర్

నృత్యమంటే ఇష్టం..



చదువుతోపాటు నృత్యం అంటే ఇష్టం. భరతనాట్యం, కూచిపూడి నృత్యంలో శిక్షణ తీసుకుంటున్నా. రోజూ ఉదయం, సాయంత్రం క్రమం తప్పకుండా శిక్షణ శిబిరానికి వస్తున్నా. ఇష్టమైన నృత్యాంశాల్లో ఇక్కడ తగిన మెళకువలు నేర్పిస్తున్నారు.

– అనన్య, గద్వాల

నృత్యంలో రాణించాలని..



మంచి డ్యాన్సర్ కావాలని నా కోరిక. అందుకే బాలకేంద్రంలో గత 20 రోజుల క్రితం మా అమ్మ ప్రోత్సాహంతో బాలకేంద్రంలో చేరాను. నృత్యంలో రాణించాలనే సంకల్పంతో టీచర్ చెప్పిన అన్ని విషయాలను జాగ్రత్తగా గమనిస్తూ ప్రతి స్టెప్‌ను తిరిగి ఇంటికి వెళ్లిన తర్వాత ప్రాక్టీస్ చేస్తున్నా. భరతనాట్యంలో భారతదేశంలోనే మంచి పేరు తెచ్చుకోవాలని ముందుకెళ్తున్నా.

– భవీష, నారాయణపేట

మహిళా సంఘాల బలోపేతం: ఎమ్మెల్యే



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: మహిళా సంఘాల బలోపేతానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం మధ్యాహ్నం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ ఆవరణలోని మెప్మా భవనంలో ఆర్పీలకు ఏర్పాటు చేసిన ఉచిత కంప్యూటర్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం విలేకరులతో ఆయన మాట్లాడుతూ ఆర్పీలకు కంప్యూటర్ పరిజ్ఞానం అవసరమని భావించి వారికి ‘మహబూబ్‌నగర్ ఫస్ట్–నవరత్నాలు’లో భాగంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకుంటే మహిళా సంఘాల పద్దులు, వారు తీసుకున్న అప్పుల వివరాలు, చెల్లింపులు తదితర సమాచారం ఒక్క క్లిక్‌తో ఒకేచోట తెలుసుకునే అవకాశం ఉంటుందన్నారు. ముఖ్యంగా కంప్యూటరీకరణతో ఎలాంటి అవకతవకలకు చోటు లేకుండా పూర్తి పారదర్శకంగా మహిళా సంఘాల కార్యకలాపాలు జరుగుతాయన్నారు. ఈ అవకాశాన్ని అందరూ ఉపయోగించుకుని కంప్యూటర్‌పై పూర్తి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, ముడా చైర్మన్ కె.లక్ష్మణ్‌యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, ‘నవరత్నాలు’ పర్యవేక్షకులు గుండా మనోహర్, కాంగ్రెస్ నాయకులు రామచంద్రయ్య, ర ఘు, జహీర్, ప్రవీణ్‌కుమార్, అక్బర్ పాల్గొన్నారు.

రేపు గిరిజన విద్యార్థులకు స్పాట్ కౌన్సెలింగ్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని బాలానగర్, కల్వకుర్తిలోని తెలంగాణ గిరిజన ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాల (టీజీఈఎంఆర్ఎస్– కాలేజ్ ఆఫ్ ఎక్స్‌లెన్స్)ల్లో ఇంటర్ మొదటి సంవత్సరంలో మిగిలిన సీట్లకు ఈనెల 26న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నామని జీటీ గురుకులం ప్రాంతీయ సమన్వయ అధికారి కె.సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బీపీసీ, సీఈసీలలో సీబీఎస్ఈ సిలబస్‌కు సంబంధించి ఈ ఖాళీలు ఉన్నాయని పేర్కొన్నారు. పదో తరగతిలో ఎక్కువ మార్కులు పొందిన గిరిజన విద్యార్థులను ఎంపిక చేస్తామని తెలిపారు. సోమవారం ఉదయం పది గంటలకల్లా మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్‌లోని టీజీఈఎంఆర్ఎస్‌లో అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో పాటు ఒక సెట్ జిరాక్స్, ఐదు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలను వెంట తెచ్చుకోవాలని, పూర్తి వివరాలకు ఫోన్ నం.94156 06618, 98557 37578, 98857 38387, 8520 041973లలో సంప్రదించవచ్చని సూచించారు.

సెర్ప్ బదిలీలకు గ్రీన్‌సిగ్నల్

- ప్రత్యేక జీఓ జారీ చేసిన ప్రభుత్వం
- మార్గదర్శకాల కోసం ఉద్యోగుల నిరీక్షణ
- నెలాఖరు వరకు ప్రక్రియ పూర్తయ్యే అవకాశం
- జిల్లాలో 99 మంది ఐకేపీ ఉద్యోగులు



జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): ఎట్టకేలకు సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందులో అన్ని కేటగిరీల వారు ఉంటారని, విధివిధానాలు ఖరారు చేసి త్వరలోనే మరో ఉత్తర్వు జారీ చేస్తామని స్పష్టం చేసింది. దీంతో పదేళ్లుగా ఒకేచోట పనిచేస్తున్న వారికి స్థానచలనం కలగనుంది. ఇతర జిల్లాల్లో పనిచేసే వారు సొంత జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తి కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. కాగా జిల్లాలో మొత్తం 99 మంది వివిధ కేడర్లలో సెర్ప్ ఉద్యోగులు ఉన్నారు.

నిరీక్షణకు తెర..

సెర్ప్, ఈజీఎస్ ఉద్యోగులకు చివరిసారిగా 2018లో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం బదిలీల ప్రక్రియ నిర్వహించింది. కాంగ్రెస్ ప్రభుత్వ వచ్చాక గతేడాది జూలై, ఆగస్టు నెలల్లో అన్ని ప్రభుత్వ శాఖల్లో బదిలీలు చేపట్టింది. అయితే తమకు కూడా బదిలీ అవుతుందని ఆయా విభాగాల్లో పనిచేసే అధికారులు, ఉద్యోగులు ఆశించారు. డీఆర్‌డీఏ అధికారులు కసరత్తు కూడా చేపట్టారు. అయితే ప్రభుత్వం వారి బదిలీలకు అవకాశం ఇవ్వలేదు. అప్పటి నుంచి వారు మంత్రి సీతక్కతోపాటు ఆ శాఖ ఉన్నతాధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. వారి విజ్ఞప్తులను పరిగణలోకి తీసుకున్న ప్రభుత్వం ఎట్టకేలకు బదిలీలకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మార్గదర్శకాలు అందిన వెంటనే కౌన్సెలింగ్ నిర్వహించేలా జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు కసరత్తు చేయాలని ఉద్యోగులు కోరుతున్నారు. తద్వారా జిల్లాలో దీర్ఘకాలంగా ఒకే చోట పనిచేసిన ఉద్యోగులకు స్థానచలనం కలగనుండగా ఇతర జిల్లాల్లో పనిచేసే వారు సొంత ప్రాంతాలకు వచ్చే అవకాశం ఉంది. కొత్తగా ఏర్పడిన మండలాల్లోనూ పూర్తి స్థాయిలో పోస్టులు భర్తీ అయ్యే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది. అయితే ఉపాధి హామీ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు సంబంధించి మాత్రం ఇంకా ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు.

40 శాతం మేర..

జిల్లావ్యాప్తంగా ఐకేపీలో 99 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు. ప్రభుత్వ నిబంధనల మేరకు వీరిలో 92 మంది బదిలీలకు అర్హత ఉన్న వాళ్లు ఉన్నారని అధికారులు చెబుతున్నారు. ఇందులో 40 శాతం వరకు బదిలీ చేయాల్సి ఉంటుంది.

తప్పని ఎదురుచూపులు..

జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ పరిధిలో సెర్ప్, ఈజీఎస్ వంటి రెండు విభాగాల్లో ఉద్యోగులు, సిబ్బంది పనిచేస్తున్నారు. సెర్ప్ పరిధిలో పని చేసే ఏపీడీలు, డీపీఎంలు, ఏపవో పోస్టులకు జోనల్ స్థాయిలో, ఏపీఎంలు, సీసీలకు జిల్లా స్థాయిలో బదిలీలు నిర్వహించాల్సి ఉంటుంది. అలాగే ఉపాధి హామీ పథకంలో పనిచేసే వారిలో ఏపీఓ, ఈసీలు, టీసీ, డీఆర్పీ, డీడీసీఎల్ ఆర్పీ, డీబీటీ మేనేజర్, సూపర్‌వైజర్ పోస్టులకు జోనల్ స్థాయిలో, అలాగే టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులకు జిల్లాస్థాయిలో బదిలీలు చేపట్టాల్సి ఉంటుంది. ఇతర అన్ని ప్రభుత్వ శాఖల్లో మాదిరిగానే మూడేళ్లకోసారి వీరికి కూడా బదిలీలు నిర్వహించాలనేది ప్రభుత్వ నిబంధన. అయితే ఆయా విభాగాల్లో సుమారు ఈ ప్రక్రియ నిర్వహించలేదు. దీంతో సదరు ఉద్యోగులు దీర్ఘకాలంగా ఒకేచోట పనిచేస్తూ బదిలీ కోసం నిరీక్షిస్తున్నారు.

మార్గదర్శకాలు రావాలి..

సెర్ప్ ఉద్యోగుల బదిలీల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేక జీఓ జారీ చేసింది. అయితే మార్గదర్శకాలు వచ్చిన తర్వాతే వాటి ఆధారంగా బదిలీల ప్రక్రియ పూర్తయ్యే అవకాశం ఉంది. త్వరలోనే అందుకు సంబంధించిన ఉత్తర్వులు అందే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాలకనుగుణంగా కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా చేపడుతాం.

– నర్సింహులు, డీఆర్‌డీఓ

ఐకేపీలో కేడర్ల వారీగా ఉద్యోగులు..	అదనపు డీఆర్‌డీఓ	డీపీఎంలు	ఏపీఎంలు	సీసీలు
	1	6	20	72

ముంపు నివారణకు తక్షణ చర్యలు

- పెద్దచెరువు పక్కన వరద కాల్వ పూర్తి చేయాలి
- ఎర్రకుంట నుంచి డ్రైయిన్ల విస్తరణ తప్పనిసరి
- స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్



ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్న స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వచ్చే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని నగరంలోని లోతట్టు ప్రాంతాల్లో ముంపు నివారణకు తక్షణమే చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్ ఆదేశించారు. ఈ మేరకు మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం సాయంత్రం ఇంజనీరింగ్ అధికారులతో సమీక్షించారు. పెద్దచెరువు పక్క నుంచి నిర్మిస్తున్న వరదకాల్వ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. ముఖ్యంగా ఎర్రకుంట తూముతో పాటు అలుగు నుంచి వేర్వేరుగా ఇమాంసాబ్‌కుంట వరకు శాశ్వత ప్రాతిపదికన సుమారు కిలోమీటరున్నర మేర డ్రెయినేజీ నిర్మించాలని అందుకు అంచనాలు సిద్ధం చేయాలని సూచించారు. మధ్యలోని రాయచూర్ మెయిన్‌రోడ్డుపై గతంలో రెండు చోట్ల ఉన్న కాజ్‌వేల వెడల్పును పెంచి పునరుద్ధరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముందుగా ఎక్కడికక్కడ డ్రెయినేజీలలో మురుగు నిల్వ ఉండకుండా శుభ్రం చేయించాలన్నారు. కాగా, ఈనెల 21వ తేదీ ఉదయం, రాత్రి సుమారు 4.30 గంటలపాటు జిల్లా కేంద్రంలో భారీ వర్షం కురియడంతో లోతట్టు ప్రాంతాలన్నీ జలమయమయ్యాయి. అదే రోజు ఆయా ప్రాంతాలను జిల్లా ఉన్నతాధికారులు పర్యటించి పరిస్థితిని అంచనా వేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో తాజాగా ఈ సమావేశం నిర్వహించడం గమనార్హం. కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డి.మహేశ్వర్ రెడ్డి, ఇన్‌చార్జ్ ఎంఈ సందీప్‌వరల్డ్, పబ్లిక్ హెల్త్ ఈఈ విజయభాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: జిల్లాలోని మూడు బాలికల, రెండు బాలుర పాఠశాలలు/కళాశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని ప్రాంతీయ అధికారిణి ఫ్లోరెన్స్‌రాణి ఒక ప్రకటనలో తెలిపారు. సంబంధిత సబ్జెక్టులలో పీజీ, బీఈడీ పూర్తి చేసి ఆసక్తి, అనుభవం కలిగిన అభ్యర్థులే అర్హులని పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రాంరెడ్డిగూడెంలోని బాలికల సాంఘిక సంక్షేమ గురుకులంలో నిర్వహించే డెమోకు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. కాగా బాలికల కళాశాలల్లో తెలుగు రెండు, ఇంగ్లిష్, మ్యాథ్స్, బాటనీ, ఫిజిక్స్, కామర్స్, సివిక్స్, ఎకనామిక్స్‌లో ఒక్కో పోస్టు తాత్కాలిక పద్ధతిన భర్తీ చేయనున్నామని వివరించారు. ఇక పాఠశాలల్లో హిందీ, మ్యాథ్స్, బయోసైన్స్‌లో మూడు చొప్పున, తెలుగు, ఇంగ్లిష్, సోషల్ స్టడీస్, పీఈటీ రెండు చొప్పున, ఫిజికల్ సైన్స్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని, బాలుర కళాశాలల్లో ఇంగ్లిష్ రెండు, బాటనీ, జువాలజీ, కెమిస్ట్రీ ఒక్కొక్కటి చొప్పున; పాఠశాలల్లో బయోసైన్స్ రెండు, ఇంగ్లిష్ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయని వెల్లడించారు.

క్లుప్తంగా

యువతి బలవన్మరణం


కృష్ణవేణి (ఫైల్)

కల్వకుర్తి టౌన్: మనస్తాపానికి గురై యువతి ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడిన ఘటన శనివారం కల్వకుర్తిలో చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, బంధువులు తెలిపిన వివరాలిలా.. పట్టణంలోని తిలక్‌నగర్ కాలనీకి చెందిన కృష్ణయ్య, రజిత దంపతుల మూడో కుమార్తె కృష్ణవేణి (20) డిగ్రీ చదువుతోంది. శనివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడింది. కుటుంబ సభ్యులు వచ్చి చూసి, యువతిని పట్టణంలోని సీహెచ్‌సీకి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. యువతికి వచ్చే నెలలో వివాహం నిశ్చయమైందని బంధువులు తెలిపారు.

లారీని ఢీకొని యువకుడి మృతి


రాజు (ఫైల్)

ధన్వాడ: మండలంలోని యంనోనిపల్లి శివారులో మక్తల్–మరికల్ ప్రధాన రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. స్థానికుల వివరాల మేరకు.. జక్లేర్ గ్రామానికి చెందిన కొంకలి రాజు (26) బైక్‌పై స్వగ్రామం నుంచి పస్పులకు వెళ్తుండగా.. యంనోనిపల్లి శివారులో అగి ఉన్న లారీని వెనక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో అతడికి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు 108 అంబులెన్స్‌లో మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. మృతుడి భార్య ప్రస్తుతం ఆరునెలల గర్భిణి. రాజు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ రాజశేఖర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి దుర్మరణం

జడ్చర్ల: మండలంలోని గొల్లపల్లి గ్రామ సమీపంలో 44వ నంబర్ జాతీయ రహదారిపై శుక్రవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా.. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ కమలాకర్ కథనం మేరకు శుక్రవారం రంగారెడ్డి జిల్లా పాలమాకుల నుంచి గుడ్ల సంజయ్(19), అతడి స్నేహితుడు సిద్ధార్థ కలిసి పని నిమిత్తం బైక్‌పై జడ్చర్లలో వచ్చారు. పని ముగించుకుని అర్ధరాత్రి సమయంలో తిరిగి పాలమాకులకు వెళ్తుండగా జాతీయ రహదారిపై లలితాంబిక తపోవనం వద్ద ప్రమాదవశాత్తు బైక్ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొట్టారు. ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో బాలానగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా.. అక్కడ చికిత్స పొందుతూ సంజయ్ మృతిచెందాడు. శనివారం మృతుడి బంధువు రాము ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

గద్వాల క్రైం: కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువుల కథనం మేరకు.. గద్వాల మండలం సంగాలకు చెందిన బోయ గోపాల్ (35) తాపీమేస్త్రీగా జీవనం సాగిస్తున్నాడు. గత కొన్ని రోజులుగా భార్యాభర్తల మధ్య ఆర్థిక గొడవలు జరిగేవి. ఈ క్రమంలో గోపాల్ శనివారం సమీపంలోని తోటలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడికి భార్య సరస్వతి, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని విచారణ చేపడుతున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

నీటి గుంటలో పడి వ్యక్తి మృతి

లింగాల: ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి దేశమోని కాశీం(35) మృతి చెందిన ఘటన శనివారం రాత్రి మండలంలోని కోమటికుంటలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన కథనం మేరకు.. కాశీం జీవనోపాధి కోసం భార్య, పిల్లలతో కలిసి హైదరాబాద్‌కు వలస వెళ్లాడు. కొన్ని రోజుల క్రితం స్వగ్రామానికి వచ్చిన ఆయన వ్యవసాయ పొలం వద్దకు వెళ్లి తిరిగి వస్తూ మార్గం మధ్యలో ఉన్న నీటి గుంటలో కాళ్లు, చేతులు శుభ్రం చేసుకోవడానికి దిగినట్లు తెలిపారు. ఇదే క్రమంలో ప్రమాదవశాత్తు నీటి గుంటలో పడి మృతి చెందినట్లు స్థానికులు పేర్కొన్నారు. మృతుడికి భార్య కవిత, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్‌ఐ వెంకటేశ్వర్‌గౌడ్ తెలిపారు.

చేపలు పట్టేందుకు వెళ్లి..

గోపాల్‌పేట: చేపలు పట్టేందుకు వెళ్లి వ్యక్తి మృతిచెందిన ఘటన ఏదుల మండలంలోని చెన్నారం గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. రేవల్లి హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖర్ తెలిపిన వివరాల మేరకు.. ఏదుల మండలంలోని చెన్నారం గ్రామానికి చెందిన పికిలి పెద్ద బాలయ్య (69) కల్లు తాగి ఇంటి నుంచి ఊర చెరువులో చేపలు పట్టేందుకు వెళ్లాడు. చెరువులోకి దిగిన అతను ఎంతకూ బయటి రాకపోవడంతో గ్రామస్తుల సహాయంతో గాలించి పెద్దబాలయ్య మృతదేహాన్ని బయటకు తీశారు. భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని హెడ్‌కానిస్టేబుల్ వివరించారు.

ఉగ్రవాదులను అరికట్టడంలో విఫలం


విలేకర్లతో మాట్లాడుతున్న జాన్‌వెస్లీ

- మావోయిస్టులతో కేంద్రం చర్చలు జరపాలి
- హక్కుల సాధన కోసం పోరాడుదాం
- కవిత లేఖపై కేసీఆర్ స్పందించాలి
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ

కల్వకుర్తి రూరల్: ఉగ్రవాదుల నుంచి దేశాన్ని, ప్రజల ప్రాణాలను రక్షించడంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ విఫలమయ్యారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ అన్నారు. పట్టణంలోని సీపీఎం కార్యాలయంలో శనివారం నిర్వహించిన పార్టీ జిల్లా నాయకుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం స్థానిక యూటీఎఫ్ భవనంలో ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అమెరికాపై చైనాతో పాటు చిన్న చిన్న దేశాలు టారిఫ్‌లు విధిస్తుంటే.. ప్రధాని మోదీ అమెరికాకు మోకరిల్లడాన్ని సీపీఎం ఖండిస్తుందన్నారు. భారత్, పాకిస్తాన్ యుద్ధం తమవల్లే ఆగిందని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించినప్పటికీ ప్రధాని ఎందుకు ఖండించడం లేదని ప్రశ్నించారు. పహల్గాంలో టూరిస్టులను హతమార్చిన ఉగ్రవాదులను ఇప్పటికీ ఎందుకు పట్టుకోలేకపోయారని నిలదీశారు. 27 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్న పాకిస్తాన్‌పై యుద్ధం ఎందుకు ఆపారని ప్రశ్నించారు. ఆపరేషన్ కగార్ పేరుతో 500 మంది నక్సలైట్లను హత్య చేశారని అన్నారు. కాల్పుల విరమణ పాటిస్తామని.. చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నామని మావోయిస్టులు చెబుతున్నప్పటికీ కేంద్రం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కేంద్రం వెంటనే స్పందించి మావోయిస్టులతో చర్చలు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్రానికి రావాల్సిన వాటాల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వినతులు ఇస్తే రావని.. పోరాడి సాధించుకోవాలన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, ఉపాధి హామీ పథకానికి బడ్జెట్ పెంపు, ప్రాజెక్టులకు జాతీయ హోదా, ఇతర నిధుల కోసం పోరాటమే శరణ్యమని ఆయన సూచించారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ ఎమ్మెల్సీ కవిత రాసిన లేఖపై స్పందించాలన్నారు. బీజేపీతో బీఆర్‌ఎస్ వైఖరి ఏమిటో స్పష్టం చేయాలన్నారు. కేంద్రంలో బీజేపీ మతతత్వ రాజకీయాలు చేయడంతో పాటు ప్రాంతీయ పార్టీలను అణిచివేస్తుందని ధ్వజమెత్తారు. భవిష్యత్‌లో బీజేపీతో పొత్తు ఉండదనే విషయాన్ని కేసీఆర్ తేల్చి చెప్పాలన్నారు.

30న రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన..

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు జాన్‌వెస్లీ తెలిపారు. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని.. రైతుభరోసా, పంట రుణమాఫీ ఇంకా అందరికీ అందలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు సాగర్ అన్నారు. కొనుగోలు కేంద్రాల్లో లారీల కొరత పేరుతో ధాన్యం ఎత్తడం లేదన్నారు. 40 కేజీల బస్తాకు అదనంగా రెండు కిలోలు తూకం వేస్తున్నారని ఆయన ఆరోపించారు. మిల్లుల వద్ద తరుగు పేరుతో మరో నాలుగు కిలోలు కోత వేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. రైతుభరోసాకు రూ. 7,500 కోట్లు బడ్జెట్‌లో కేటాయించి.. ఇప్పటి వరకు నాలుగెకరాలు ఉన్న రైతులకు రూ. 4,366 కోట్ల మాత్రమే రైతుల ఖాతాల్లో జమ చేశారన్నారు. మిగతా డబ్బులు ఎందుకు ఇవ్వడంలేదని ఆయన ప్రశ్నించారు. కలెక్టరేట్‌లలో పనిచేసే కాంట్రాక్టు సిబ్బందికి వెంటనే వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి పర్వతాలు, బి.ఆంజనేయులు, సి.ఆంజనేయులు, పులిజాల పరశురాములు, ఏపీ మల్లయ్య, బాల్‌రెడ్డి, దేశీయ నాయక్, బాలస్వామి, జగన్ ఉన్నారు.

కంపెనీ పనులు నిలిపేయాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న నారాయణపూర్ గిరిజనులు

వెల్దండ: మండల పరిధిలోని నారాయణపూర్ తాండాలో నిర్మిస్తున్న కంపెనీ పనులు నిలిపివేయాలని తాండవాసులు ఆందోళనకు దిగారు చెందుతున్నారు. ఈ మేరకు శనివారం పనులు చేపట్టిన కూలీలను అడ్డుకొని బయటికి పంపించేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బొక్కలను ఉడికించే కంపెనీతో ఈ ప్రాంతంలోని వాతావారణం కలుషితమైపోతుందన్నారు. వ్యవసాయం చేసుకొని జీవనం సాగించే తమకు కంపెనీ వల్ల తమ భూములు నాశనం అవుతాయన్నారు. హైదరాబాద్‌కు చెందిన కొంతమంది వ్యక్తులు భూములు కొనుగోలు చేసి ఎలాంటి అనుమతులు లేకుండా ఎక్కడో ఉన్న బొక్కల కంపెనీ పరికరాలను తీసుకొచ్చి బిగిస్తున్నట్లు పేర్కొన్నారు. మిషన్ పరికరాల్లో కుళ్లిపోయిన బొక్కలు ఉండడంతో దుర్వాసన వెదజల్లుతుందన్నారు. వెంటనే ఉన్నతాధికారులు విచారణ జరిపి పనులను నిలిపివేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు గోపాల్‌నాయక్, బక్యనాయక్, పాండునాయక్, ఆయా గిరిజన తాండవాసులు, రైతులు పాల్గొన్నారు.

నిషేధిత బీజీ–3 పత్తి విత్తనాల పట్టివేత

- ఈర్లపల్లితండాలో గుట్టుగా పత్తి విత్తనాల నిల్వలు
- ఇద్దరు నిందితుల అరెస్ట్


వివరాలు వెల్లడిస్తున్న సీఐ కమలాకర్, డీఏఓ వెంకటేశ్

జడ్చర్ల: ప్రభుత్వం నిషేధించిన బీజీ–3 పత్తి విత్తనాలను శనివారం జిల్లా వ్యవసాయ శాఖ, పోలీసులు సంయుక్తంగా దాడులు చేసి పట్టుకున్నారు. ఈర్లపల్లితండాలో గుంటూరు, మాచర్ల ప్రాంతాల నుంచి గుట్టుగా లూజ్ పత్తి విత్తనాలను దిగుమతి చేసుకుని రైతులకు విక్రయిస్తున్నారన్న సమాచారం అందడంతో స్థానిక వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా అధికారులకు విషయాన్ని చేరవేశారు. దీంతో వ్యవసాయ శాఖ జడ్చర్ల పోలీసులను అప్రమత్తం చేసింది. ఈ క్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్, సీఐ కమలాకర్ తాండాలోని పలువురు రైతుల ఇళ్లలో ఏకకాలంలో సోదాలు నిర్వహించారు. తనిఖీలలో మేఘనాథ్ చంద్య దగ్గర 30 కిలోలు, మేఘనాథ్ రవి దగ్గర 15 కిలోల బీజీ–3 పత్తి విత్తనాలు దొరికాయి. మొత్తం 45 ప్యాకెట్లను వారి నుంచి స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని జడ్చర్ల పోలీస్ స్టేషన్‌కు తరలించారు. విత్తనాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు తరలించి పరీక్షిస్తామని అధికారులు తెలిపారు.

మార్మోగిన అంజన్న నామస్మరణ


భక్తులతో కిక్కిరిసిన ఆలయం

ఎర్రవల్లి: మండలంలోని బీచుపల్లి పుణ్యక్షేత్రం శనివారం ఆంజనేయస్వామి నామస్మరణతో మార్మోగింది. ఈ సందర్భంగా నెల రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా రెండో వారం కావడంతో భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు ఆంజనేయస్వామికి పంచామృత అభిషేకం, ఆకుపూజ, మహా మంగళహారతి నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని కృష్ణా నదిలో స్నానాలను ఆచరించి ఆంజనేయస్వామిని దర్శించుకున్నారు. మట్టి కుండలలో ప్రత్యేక నైవేద్యం వండి స్వామివారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.


బీచుపల్లి అభయాంజనేయుడిని దర్శించుకుంటున్న భక్తులు

జూరాలలో 5 టీఎంసీలకు చేరిన నీటి మట్టం

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో డెడ్ స్టోరేజీ నుంచి ప్రాజెక్టు నీటి మట్టం రోజురోజుకు పెరుగుతూ వస్తోంది. ఎగువన కురుస్తున్నా వర్షాలతో ప్రాజెక్టుకు 4,172 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతున్నట్లు పీజేపీ అధికారులు శనివారం తెలిపారు. మొన్నటి వరకు 3 టీఎంసీలకు పడిపోయిన నీటి మట్టం రెండు రోజులుగా వస్తున్న ఇన్‌ఫ్లోతో 2 టీఎంసీల నీరు చేరడంతో ప్రాజెక్టు నీటిమట్టం ప్రస్తుతం 5.012 టీఎంసీలకు చేరినట్లు పేర్కొన్నారు. జూరాల ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 9.657 టీఎంసీలు కాగా ప్రస్తుతం 5.012 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు వెల్లడించారు.

శ్రీశైలంకు 6,560 క్యూసెక్కుల నీరు

దోమలపెంట: సుంకేసుల నుంచి శ్రీశైలం జలాశయానికి శనివారం 6,560 క్యూసెక్కుల నీరు వచ్చి చేరింది. ప్రస్తుతం శ్రీశైలం జలాశయంలో నీటిమట్టం 818.0 అడుగుల వద్ద 39.3750 టీఎంసీల నీటి నిల్వ ఉంది. గత ఇరవై నాలుగు గంటల వ్యవధిలో రేగుమాన్‌గడ్డ నుంచి ఎంజీకేఎల్‌ఐకు 800 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అలాగే 2.890 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి చేసి దిగువన ఉన్న సాగర్‌కు 5,824 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు.

రిజర్వాయర్ నిర్మాణానికి సహకరించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ

- భూ సేకరణ రైతు అవగాహన సదస్సులో ఎమ్మెల్యే వంశీకృష్ణ
- ఉద్రిక్తల మధ్య కొనసాగిన బల్మూరు గ్రామసభ

బల్మూర్: నల్లమల ప్రాంతంలోని బీడు భూములకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన ఉమామహేశ్వర రిజర్వాయర్ నిర్మాణానికి రైతులు సహకరించాలని ఎమ్మెల్యే వంశీకృష్ణ అన్నారు. అచ్చంపేట లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం స్టేజ్–1 నిర్మాణంతో భూములు కోల్పోతున్న రైతులతో శనివారం బల్మూరులోని జిల్లా పరిషత్ మైదానంలో ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు తీవ్ర ఉద్రిక్తతల మధ్య కొనసాగింది. భూ సేకరణ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అరుణారెడ్డి సమక్షంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని రైతుల అభిప్రాయాల అనంతరం మాట్లాడారు. బల్మూర్ సమీపంలో చేపడుతున్న ఈ రిజర్వాయర్‌లో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరాకు రూ.20 లక్షలు ఇవ్వాలనే ప్రతిపాదన వినతిపత్రాన్ని సీఎం రేవంత్‌రెడ్డికి అందజేశామన్నారు. అలాగే ఈ ప్రాంతాన్ని టూరిజం హబ్‌గా అభివృద్ధి చేసి స్థానిక నిర్వాసితులకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగావకాశాలతోపాటు చెంచు రైతులకు భూమికి భూమి ఇచ్చేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన డిజైన్‌లో అనంతవరం, బల్మూర్ గ్రామాలకు ముప్పు ఉందని, ఇళ్లు కూడా కోల్పోతారని గుర్తించి 2.67 టీఎంసీల నుంచి 2.40 టీఎంసీలకు కుదించి రీడిజైన్ మార్పు చేయించానన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ బాలస్వామి, తహసీల్దార్ శ్రీకాంత్, ఎంపీడీఓ రాఘవులు పాల్గొన్నారు. అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాస్, సీఐ రవీందర్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు ఏర్పాటు చేయాలి


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ మండలాల్లో స్టడీ సెంటర్‌లు లేవని, వాటిలో వెంటనే స్టడీ సెంటర్‌ను ఏర్పాటు చేసుకునేందుకు హెచ్‌ఎంలు ముందుకు రావాలని ఉమ్మడి జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ శివయ్య పేర్కొన్నారు. జిల్లాకేంద్రంలోని జేపీఎన్‌సీఈ కళాశాలలో హెచ్‌ఎంలకు శిక్షణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మిడ్జిల్, మూసాపేట, అడ్డాకుల వంటి మండలాల్లో ఒక్క స్టడీ సెంటర్లు కూడా లేవని వెంటనే ఏర్పాటు చేసుకునేందుకు ముందు రావాలని సూచించారు. ఆయా ప్రాంతాల్లో మధ్యలో చదువు ఆపేసిన విద్యార్థులకు స్టడీ సెంటర్లు ఏర్పాటు చేసి అడ్మిషన్లను ఇచ్చేందుకు అవకాశం ఉందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్‌లను ఏర్పాటు చేసుకునేందుకు అడిగిన వారికి అనుమతి ఇస్తామన్నారు. అక్షరాస్యతను పెంచేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, అందులో భాగంగా సెంటర్‌లు ఏర్పాటు చేసి, నిరక్షరాస్యులు ఎస్సెస్సీ, ఇంటర్ చేసేందుకు అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్, సీఎంఓ బాలుయాదవ్ పాల్గొన్నారు.

నిందితులకు రిమాండ్

తిమ్మాజిపేట: మండలంలోని వెంకాయపల్లిలో ఇటీవల జరిగిన చోరీ కేసులో ముగ్గురు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ హరిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ఎస్‌ఐ వివరాల ప్రకారం గ్రామ సమీపంలో ఈనెల 19న ప్రమీల గెస్టహౌస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు మూడు ఏసీలు అపహరించుకుపోయారు. ఈ నెల 20న శ్రీధర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేయగా నిందితులు మంగ శ్రీకాంత్, ప్రకాశ్, అల్తాఫ్‌లను గుర్తించి పట్టుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఏసీలను సీజ్ చేసి కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. నిందితులను కోర్టులో హాజరుపర్చగా జడ్జి ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

మేకలు కాసేందుకు వెళ్లి మృత్యుఒడిలోకి..


మృతి చెందిన లిల్లి, గణేష్

గోపాల్‌పేట: మేకలు కాసేందుకు వెళ్లి ఇద్దరు చిన్నారులు మృత్యువాత పడిన ఘటన మండలంలోని నర్సింగాయపల్లి శివారులో శనివారం సాయంత్రం చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు.. నర్సింగాయపల్లి గ్రామానికి చెందిన వెంకటయ్య, కృష్ణమ్మ దంపతులకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. వెంకటయ్య ఎనిమిది నెలల క్రితం గ్రామానికి సమీపంలోనే చెట్టు మీద నుండి కిందపడి మృతి చెందాడు. తల్లి కృష్ణమ్మ కూలీ పనులు చేస్తూ.. పిల్లలు మేకలు కాస్తూ జీవనం కొనసాగిస్తున్నారు. ఎప్పటిలాగే శనివారం మధ్యాహ్నం పిల్లలు లిల్లి (10), గణేష్ (5) ఇద్దరూ మేకలు మేపుతూ బయటికి వెళ్లారు. శనివారం సాయంత్రం ఎనిమిది గంటల వరకు మేకలు ఇంటికి వచ్చినా.. పిల్లలు రాలేదు. కుటుంబ సభ్యులు, చుట్టుపక్కల వారు వెతికేందుకు గ్రామానికి సమీపంలోని చెట్ల వైపు వెళ్లి వెతుకుతుండగా నర్సింగాయపల్లికి సమీపంలోని ఓ బావి వద్ద లిల్లి, గణేష్‌కు చెందిన చెప్పులు, బట్టలు కనిపించాయి. గుర్తించిన గ్రామస్తులు వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. వెంటనే వారు ఘటనా స్థలానికి చేరుకుని బావిలో వెతకగా.. రాత్రి తొమ్మిదిన్నర ప్రాంతంలో లిల్లి, గణేష్ మృతదేహాలు లభించాయి.

బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

వీపనగండ్ల: మండలంలోని సంగినేనిపల్లికి చెందిన పికిలి శేఖర్ (40) శనివారం సాయంత్రం బైక్‌పై నుంచి కిందపడి మృతి చెందిన ఘటన చోటు చేసుకుంది. స్థానిక హెడ్‌కానిస్టేబుల్ వెంకటేష్ కథనం ప్రకారం.. శేఖర్ శ్రీరంగాపూర్ మండలంలోని నాగరాల గ్రామంలోని తమ బంధువుల ఇంటి వెళ్లి తన సొంత గ్రామానికి వస్తుండగా సంగినేనిపల్లి, కల్వరాల గ్రామాల మధ్య బైక్ అదుపు తప్పి కిందపడడంతో మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని వనపర్తి జిల్లా ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. మృతుడికి భార్య రేణుక, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.


పికిలి శేఖర్ మృతదేహం

రూ.1.45 లక్షలు వసూలుపై కేసు నమోదు

గద్వాల క్రైం: ఓ రైతు అయిదు ఎకరాల వ్యవసాయ పొలాన్ని తన పేరున భూ భారతిలో నమోదు, పాసుబుక్‌ల జారీ కోసం దళారీకి రూ.1.45లక్షలు ఇచ్చి మోసపోయిన ఘటనపై పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన ఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు, బాధితుడు కథనం మేరకు.. గద్వాల పట్టణానికి చెందిన వెంకటేష్ కేటీదొడ్డి మండలంలోని తన అయిదు ఎకరాల వ్యవసాయ భూమి తన పేరుపై భూ భారతిలో నమోదు, పాసుబుక్‌లు జారీ చేయాల్సిందిగా రెవెన్యూ కార్యాలయంలో దరఖాస్తు చేసుకున్నాడు. అయితే హైదరాబాద్‌కు చెందిన ఓ దళారీ ఫోన్ ద్వారా పరిచయం చేసుకుని మీ పేరుపై భూభారతిలో పేరు నమోదు చేసి వారం రోజుల వ్యవధిలో పాసుబుక్‌లు జారీ చేస్తామని అందుకు రూ. 5లక్షలు ఇవ్వాలని ఒప్పందం కుదుర్చుకున్నారు. దళారి మాటలు నమ్మిన వెంకటేష్ ముందస్తుగా రూ. 1.45 లక్షలను ఏప్రిల్ 26 తేదీన చెల్లించాడు. అయితే నేటి వరకు ఎలాంటి ఫలితం లేకపోవడంతో శనివారం బాధిత రైతు మోసపోయినట్లు గుర్తించి పట్టణ పోలీసుస్టేషన్‌లో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ కళ్యాణ్‌కుమార్ తెలిపారు. మోసపూరితమైన వ్యక్తులపై రైతులు ప్రమత్తంగా ఉండాలన్నారు.

97.91 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత


స్వాధీనం చేసుకున్న వాహనం

నారాయణపేట: అప్పిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోటి చందు అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ముందస్తు సమాచారం మేరకు చందు ఇంటి వద్ద బొలేరో వాహనంలో పీడీఎస్ బియ్యాన్ని లోడ్ చేస్తుండగా సివిల్ సప్లయ్ డీటీ కాశప్ప, రూరల్ పోలీసులు దాడి చేసి వాహనంతో పాటు 97.91 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం డీటీ పంచనామా చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ట్రైనీ ఎస్‌ఐ గాయత్రి తెలిపారు.

అనారోగ్య సమస్యతో యువతి ఆత్మహత్య

వెల్దండ: అనారోగ్యంతో బాధపడుతున్న ఓ యువతి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన వెల్దండ మండలం మర్రిగుంతతండా పంచాయతీ గాజులోనిబావి తండాలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ కురుమూర్తి వివరాల మేరకు.. తండాకు చెందిన వడ్యావత్ పద్మ (18) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తండ్రి భద్రునాయక్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.